నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మోతీనగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. మైహోం ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 7 నుంచి 7.30 గంటల వరకు సీజీఆర్ స్కూల్, గంధర్వ హోటల్, 7 సీజన్స్ స్విమ్మింగ్‌పూల్ రోడ్డు, నర్మదా నారాయణ క్యాంపస్, రోడ్డు నెంబర్ 20,21 ప్రాంతాల్లో..

◆ అయయప్ప ఫీడర్ పరిధిలో ఉదయం 7 నుంచి 7.30 గంటలకు సిమ్మింగ్‌పూల్ ప్రాంతం, రుచి టిఫిన్ సెంటర్, పిల్లర్ నెంబర్ 450 ప్రాంతాల్లో..

◆ హ్యూందయ్ ఓహెచ్ ఫీడర్ పరిధిలో ఉదయం 7 నుంచి 7.30 వరకు సలీం టీ పాయింట్, ప్రిన్స్ డ్రైవ్ రామరాజు గెస్ట్‌హౌస్ ప్రాంతాల్లో..

◆ సర్వే ఆఫ్ ఇండియా ఫీడర్ పరిధిలో ఉదయం 8.30 నుంచి 9 గంటల వరకు అప్నా జార్ ఎదురు, రోడ్డు నెంబర్ 33 నుంచి 41, పిల్లర్ నెంబర్ 862 నుంచి 1045 వరకు...

◆ ఎస్‌బీఐకాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 8.30 నుంచి 9గంటల వరకు సూర్య పేపర్ ప్రాంతం, రామరాజు గెస్ట్ హౌస్ ప్రాంతం, ఆర్‌ఆర్‌ఆర్ బార్ అండ్ రెస్టారెంట్ ప్రాంతం, సొసైటీ ఆఫీస్ రోడ్డు, విష్ణు విస్త అపార్టుమెంట్, దోబీ ఘాట్..

◆ పర్వత్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 8.30 నుంచి 9 గంటల వరకు పర్వత్‌నగర్ ఆటో స్టాండ్ ప్రాంతం, పర్వత్‌నగర బండ్లగడ్డ ప్రాంతం, పర్వత్‌నగర్ హనుమాన్ దేవాలయం ప్రాంతాల్లో...

◆ పద్మావతినగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 8.30 నుంచి 9గంటల వరకు జేకే పాయింట్ హోటల్, రాణాప్రతాప్‌నగర్ ప్రాంతం, ఆర్‌కే సొసైటీ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి పోచమ్మ కల్యాణోత్సవాలు

మోతీనగర్: కబీర్‌నగర్, అవంతినగర్‌లోని పోచమ్మ తల్లి కల్యాణ మహోత్సవాలు ఈనెల 8వ తేదీ నుంచి నుంచి 10వ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా 9వ తేదీ ఉదయం 10.51 గంటలకు అమ్మవారి కల్యాణం, 10వ తేదీ బోనాలు, సాయంత్రం 3గంటలకు తొట్టెల ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు.

గ్రూప్-1 పరీక్షలకు అన్ని రూట్‌లలో ఆర్టీసీ సేవలు

కూకట్‌పల్లి డీఎం ఇషాక్

మూసాపేట: కూకట్‌పల్లి డిపో నుంచి గ్రూప్-1 పరీక్ష కేంద్రాలకు అన్ని రూట్‌లలో ఆర్టీసీ బస్సులు నడుపుతున్నామని కూకట్‌పల్లి డీఎం ఇషాక్ బిన్ మహమ్మద్ తెలిపారు. ఒకే ప్రాంతం నుంచి సుమారు 30 మంది అభ్యర్థులు ఏదైనా సెంటర్‌కు పరీక్ష రాసే వారు ఉంటే 1.5 ఫెయిర్ చొప్పున చార్జీతో బస్సులు సెంటర్ వరకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ట్రాఫిక్‌లో ఇబ్బందులు పడే బదులు నేరుగా పరీక్ష కేంద్రం వరకు బస్సులు నడిపిస్తున్నామని తెలిపారు. గ్రూప్-1 పరీక్ష రాసే అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

బక్రీద్ శాంతియుతంగా జరుపుకోవాలి



శాంతి కమిటీ సమావేశంలో డీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రామకృష్ణ

మూసాపేట: కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈనెల 17న బక్రీద్ సందర్భంగా మసీదు కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మల్లు రవికి శుభాకాంక్షల వెల్లువ



మల్లు రవికి శుభాకాంక్షలు తెలుపుతున్న టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి, అమూల్య కుటుంబీకులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ లోక్‌సభ ఎంపీగా విజయం సాధించిన మల్లు రవిని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం మల్లు రవి నివాసంలో టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు మల్లికార్జున్ యాదవ్, కనకరాజుయాదవ్, కుంటన్న, శ్రీరామ్ యాదవ్, షాహెన్నా, అస్లాం, షబ్బీర్, మల్లేష్, రమణ, సందీప్ తదితరులు ఎంపీ మల్లు రవిని కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

◆ ఓల్డ్‌బోయిన్‌పల్లి కాంగ్రెస్ కంటెస్టెడ్ కార్పొరేటర్ దండుగుల అమూల్య భరత్ కుటుంబీకులు నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

గంటల వ్యవధిలోనే ఛేదించారు

- తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు
- బాలానగర్ పోలీసులకు తల్లిదండ్రుల కృతజ్ఞతలు



తప్పిపోయిన బాలుడిని తండ్రికి అప్పగించిన బాలానగర్ పోలీసులు

బాలానగర్: బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి 8 గంటల ప్రాంతంలో పదేళ్ల బాలుడు కనపించటం లేదన్న సమాచారం పోలీసులకు అందింది. వెంటనే ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్ వెంటనే స్పందించి సిబ్బందిని అప్రమత్తం చేశారు. గంటల వ్యవధిలోనే బాలానగర్ పోలీసులు బాలుడి ఆచూకీ కనుగొని ఔరా అనిపించారు. ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీహెచ్‌బీ కాలనీలో నివసించే ఎలిమినేటి రాజశేఖర్‌రెడ్డి కుమారుడు కృతిక కళ్యాణ్‌రెడ్డి(10) గురువారం సాయంత్రం ఆడుకుంటూ బయటకు వెళ్లాడు. దీంతో బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా గాలింపు చేపట్టారు. సైకిల్‌పై గండిమైసమ్మ వైపు వెళ్లినట్లు గ్రహించిన పోలీసులు, కేసును కొద్ది గంటల్లో ఛేదించి బాలుడిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో తమ కొడుకును క్షేమంగా అప్పగించినందుకు బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

రెండ్రోజులు చేపట్టి.. 5 రోజులు నిలిపేసి!



భరత్‌నగర్ కాలనీ మెట్రో స్టేషన్ వద్ద పేరుకుపోయిన చెత్తా చెదారం

- రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం
- నాలా ఉప్పొంగితే ఇళ్లు మునిగిపోతాయి: స్థానికులు
- భారీ వర్షాలు రాకముందే పనులు పూర్తి చేయాలని వినతి

మూసాపేట: ఓపెన్ నాలా పూడిక తీయడం, రిటైనింగ్‌వాల్ నిర్మాణం వంటి పనులు వేసవి కాలంలోనే పూర్తి చేయాలి. కానీ వర్షాకాలం ఈ నిర్మాణ పనులు ప్రారంభించడం స్థానికులను భయ భ్రాంతులకు గురి చేస్తోంది. ప్రారంభించిన పనులను మధ్యలోనే వదిలివేయటంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ అధికారికి చెప్పాలో తెలియక సతమతం అవుతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. ఫతేనగర్ డివిజన్ పరిధిలోని జింకలవాడలో నాలా పరీవాహక ప్రాంతవాసుల పరిస్థితి ఇది.

◆ కొన్ని ప్రాంతాల్లో పూడిక తీయకుండా అలాగే వదిలివేశారు. వర్షాకాలంలో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు మొదట ప్రారంభించి ప్రహరీను కూల్చివేసిన అనంతరం అటువైపు అధికారులు, సిబ్బంది కన్నెత్తి చూడకపోవటంతో చినుకు పడితే స్థానికుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

◆ నాలా పూడిక తీయకపోవటం వల్ల ప్రహరీను కూల్చివేయటంతో చిన్న వర్షం పడ్డా ఇళ్లల్లోకి వచ్చే విధంగా నాలా ప్రవహిస్తుందని వాపోతున్నారు. భారీ వర్షం కురిస్తే తమ ఇళ్లతో పాటు తాము కూడా నాలాలో కొట్టుకుపోయే ప్రమాదం ఉందని వారు భయపడుతున్నారు. తమ ఇళ్ల ముందు ఏ కారు వచ్చినా, ఏ కొత్త బైక్ వచ్చినా మీరు మున్సిపల్ అధికారులా? అంటూ మహిళలు ప్రశ్నిస్తూ వారి కోసం పడిగాపులు కాస్తున్నారు.

◆ ఈ ఇళ్ల ప్రహరీలను పూర్తిగా కూల్చివేసి కాంక్రీట్‌తో ఎత్తైన రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం పనుల్లో కొంత వరకు కూల్చివేశారు. ఇంకా కొన్ని ఇళ్ల ప్రహరీలను కూల్చివేయాల్సి ఉంది. గత వారం రోజుల క్రిందట ప్రారంభించి రెండు రోజులు చేసిన పనులు గత ఐదు రోజుల నుంచి పనులను నిలిపివేశారు. హిటాచి వాహనం కూడా నాలాలోనే వదిలేసి ఉంది.

◆ ఐడీఎల్ చెరువు, మైసమ్మ చెరువు అలుగు నుంచి వచ్చే నీరు, కూకట్‌పల్లి, మూసాపేట, భరత్‌నగర్, ప్రశాంత్‌నగర్‌ల మీదుగా వచ్చే నాలా నీరు ఈ దారి నుంచే వెళ్తుంది. భారీ వర్షం కురిస్తే తాము కూడా నాలాలో కలిసిపోయే ప్రమాదం ఉందన్నారు. త్వరగా పనులు పూర్తి చేసి తమ గుండె దడను తగ్గించాలని స్థానికులు వేడుకొంటున్నారు.

◆ ఎప్పుడో వేసవి కాలంలోనే పనులు ప్రారంభించి పూర్తి చేసేవారు. కానీ వర్షాకాలం ప్రారంభం కానున్న ఈ సమయంలో పనులను ప్రారంభించి వదిలేయటంతో నాలా పరివాహక ప్రాంతంలో తమ ఇళ్ల ప్రహరీ పోయినా ప్రజల పరిస్థితి దిక్కుతోచని విధంగా ఉంది.

పలుచోట్ల పూడికతీత...

◆ భరత్‌నగర్‌కాలనీ మెట్రోస్టేషన్, పిల్లర్ వద్ద పూడిక తీయకపోవటంతో భారీ ఎత్తున చెత్తాచెదారం పేరుకుపోతోంది. భవానినగర్ నుంచి వెంకటేశ్వరనగర్‌కు వెళ్లే దారిలో బ్రిడ్జివద్ద పూడిక తీయలేదు. ఈ ప్రాంతంలో కూడా నాలా సమీపంలోని చిన్న చిన్న గుడెసెల్లో పేద ప్రజలు నివసిస్తున్నారు.

◆ పూడిక తీయటం వల్ల నీరు సాఫీగా ప్రవహించటమే కాక లోతట్టు ప్రాంత ప్రజలకు ఎటువంటి ప్రమాదం జరగకుండా ఉంటుంది. అంతేకాకుండా శ్మశానవాటికలో, భరత్‌నగర్‌లో నాలా పూడిక తీసినా ఆ వ్యర్థాలను అక్కడే వదిలివేయటంతో అవి తిరిగి నాలాలోనే కలుస్తున్నాయి. దీంతో పూడిక తీసినా కూడా ఉపయోగం లేకుండా పోతోంది.





జింకలవాడలో రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం కూల్చివేసిన ఇళ్ల ప్రహరీలు

ఈనెల 25లోపు పూర్తవుతాయి..

ఇరవై రోజుల్లో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు పూర్తి చేస్తాం. ఎన్నికల కోడ్ ఉండటం వల్ల పనులను ఆలస్యంగా ప్రారంభించాల్సి వచ్చింది. పనులను వేగవంతం చేసి ఈనెల 25వ తేదీ లోపే పూర్తి అవుతాయి.

– ఏఈ పవన్

విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు

ఉన్నతాధికారులకు విన్నవించినా స్పందించని వైనం



భరత్‌నగర్ కాలనీలోని ఈడబ్ల్యూఎస్ ట్యాంక్ వద్ద విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు

మూసాపేట: భరత్‌నగర్‌కాలనీలోని ఈడబ్ల్యూఎస్ ట్యాంక్ వద్ద విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు ప్రమాదకరంగా పడి ఉన్నాయి. పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవటం లేదని స్థానికులు వాపోతున్నారు. చెట్ల కొమ్మల బరువుకు 11కేవీ విద్యుత్ తీగలు కిందకు సాగిపోయాయి. మరోచోట చెట్టు కొమ్మ విరిగి విద్యుత్ తీగలపై పడి కొన్ని నెలలు గడుస్తున్నా దానిని తొలగించటం లేదు. ఆ కొమ్మ పూర్తిగా ఎండిపోయి ఉంది. మీటర్ రీడింగ్ కోసం వచ్చే ఎలక్ట్రికల్ సిబ్బందికి పలుమార్లు చెప్పినా పట్టించుకోవటం లేదని స్థానికులు వాపోతున్నారు. గాలివానలకు చెట్ల కొమ్మలు విరిగి వైర్లపై పడటం, ఊగటం వల్ల షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వస్తున్నాయి.

నేటి నుంచి హరిహర క్షేత్రం వార్షిక బ్రహ్మోత్సవాలు



మూసాపేట: భరత్‌నగర్‌కాలనీలోని హరిహర క్షేత్రంలో వేంకటేశ్వరస్వామి దేవాలయం 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభించారు. ఈనెల 14వ తేదీ వరకు ఆలయంలో విశేష పూజలు నిర్వహిస్తామని అర్చకులు బలరామకృష్ణుడు తెలిపారు. శుక్రవారం ఉదయం విష్ణు సహస్రనామ పారాయణం, ప్రత్యేక పూజలతో ప్రారంభించారు. ఈనెల 9వ తేదీన అగ్ని ప్రతిష్ట, గరుడ సేవ, సంతానం కావాల్సిన వారికి గరుడ ప్రసాదం పంపిణీ, 12వ తేదీన అలివేలు మంగమ్మ, పద్మావతి దేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం, మధ్యాహ్నం 12గంటలకు అన్నసమారాధన, 14వ తేదీ చక్రతీర్థం, పుష్పయాగం, తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



జవహర్‌నగర్‌కాలనీలో డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ జవహర్ కాలనీలో రూ.9లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ పనులను శుక్రవారం కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ ప్రారంభించారు. అనంతరం కాలనీలో పర్యటించి సమస్యల గురించి అసోసియేషన్ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ లైన్ వేయాల్సి ఉందని చెప్పడంతో ఆయన వెంటనే జలమండలి మేనేజర్ అనిల్‌కుమార్‌తో మాట్లాడి పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో నిధులు మంజూరు చేయించుకొని పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నాలా రిటర్నింగ్ వాల్ పనుల కోసం అంచనాలు సిద్ధం చేయటం జరిగిందని త్వరలో అవి కూడా మంజూరు చేసి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుక్కల రాము ముదిరాజ్, కుక్కల కీర్తి, వెంకటేష్, సుబ్బరాయుడు, విద్యాసాగర్, నరసయ్య, శ్రీనివాస్, విజయలక్ష్మి, కమల, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయటమే ప్రభుత్వ లక్ష్యం

సునీతా మహేందర్‌రెడ్డి



సునీతా మహేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసిన శేరి సతీష్‌రెడ్డి, నాయకులు

కేపీహెచ్‌బీకాలనీ: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లి నియోజకవర్గ నాయకులు కూకట్‌పల్లి మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో సునీతా మహేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు వారి ఓట్లు బీజేపీకి వేయించారని ఆరోపించారు. అందువల్లే తాను పరాజయం పాలయ్యానని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో డిపాజిట్ రాని బీజేపీ ఎలా గెలుపొందుతుందని ఆమె ప్రశ్నించారు.

బీఆర్ఎస్ శకం ముగిసింది..

రాష్ట్రంలో బీఆర్ఎస్ శకం ముగిసిపోయిందని ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే మేలు జరుగుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన అమరుల కుటుంబాలను ఆదుకుంటారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల హామీని నిలబెట్టుకుంటుందన్నారు. తాను ఎంపీగా ఓడిపోయినప్పటికీ ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌కుమార్, రమేష్, రజిత, బోజమ్మ, అరవింద్‌రెడ్డి, మేకల మైకేల్, అబ్దుల్ బాకీ తదితరులు పాల్గొన్నారు.

10న ఏజీ వర్సిటీ స్నాతకోత్సవం

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆరవ స్నాతకోత్సవంను ఈ నెల 10 సోమవారం నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి ఇంచార్జీ ఉపకులపతి ఎం రఘునందన్‌రావు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్, భారతీయ స్టేట్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ చెల్లా శ్రీనివాస్‌శెట్టి పాల్గొంటారన్నారు .ఇందులో 587 మంది విద్యార్థులకు అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీలను,165 మంది విద్యార్థులకు పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీలని అందజేయనున్నట్లు తెలిపారు.

కల్యాణం.. కమనీయం



కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ కాలనీ సర్దార్ పటేల్‌నగర్‌లోని శ్రీలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. ఉదయం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, అగ్ని ప్రతిష్ట, తదుక్త హవనం, పూర్ణాహుతి, శ్రీస్వామివారి ఉత్సవ మూర్తులకు స్నపనం పూజలు చేశారు. సాయంత్రం పుష్పయాగం పూజలు చేశారు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు మూడు పూటలా అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.



శ్రీవారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

క్రైం కార్నర్..

లోన్‌లు ఇప్పిస్తానని మోసం

నిందితుడి అరెస్టు

బాధితుల నుంచి రూ.లక్షల్లో వసూలు

కేపీహెచ్‌బీకాలనీ: పలు ప్రైవేట్ సంస్థల్లో లోన్‌లు ఇప్పిస్తానని పలువురిని మోసం చేసిన సంఘటనలో ఓ వ్యక్తిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కేపీహెచ్‌బీ కాలనీ 3వ రోడ్డులో నివాసముంటున్న గాల శ్రీనివాస్ బాబు ఐస్ క్రీమ్ డిస్ట్రిబ్యూటర్‌గా బండిల ద్వారా వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలోనే అతని వద్దకు వచ్చి పరిచయం ఏర్పడిన వారితో వివిధ సంస్థల్లో లోన్లు ఇప్పిస్తానని నమ్మబలికించాడు.

◆ ఈ క్రమంలోనే వారి వద్ద నుంచి అవసరమైన డాక్యుమెంట్స్ తీసుకొని ఆయా సంస్థల్లో లోన్ పొందటం కోసం దరఖాస్తు చేయించేవాడు. లోన్ కేటాయించిన అనంతరం వాటికి సంబంధించిన వస్తువులను బాధితులకు ఇవ్వకుండా తాను మరొకరికి విక్రయించేవాడు. ఈఎంఐ బాధితులు కట్టేటట్లుగా వారికి ఎక్కువ మొత్తంలో వడ్డీలు ఇప్పించేటట్లుగా వారి వద్ద నుంచి నగదు తీసుకొని నమ్మించేవాడు. సుమారు 30 మంది బాధితుల నుంచి లక్షల్లో నగదు వసూలు చేశాడు.

◆ తాము మోసపోయినట్లుగా గ్రహించిన బాధితులు శుక్రవారం కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీనివాసు బాబు సైతం తనను వ్యాపారం చేసుకోకుండా చంపేస్తానని బాధితులు బెదిరిస్తున్నట్లు పోలీసులకు తెలిపాడు. అప్పులు చేసిన మాట వాస్తవమే అని పోలీసులతో పేర్కొన్నాడు. అయితే ఎవరి వద్ద ఎంత నగదు? ఎంత వడ్డీ? తీసుకున్నాడో విచారణ చేసి శ్రీనివాస్‌పై చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

మాతృత్వం కోసం ఆస్పత్రికి వెళ్తే.. వైద్యం వికటించి మహిళ మృతి

మే 31వ తేదీన ఘటన

- డబ్బులు ఇవ్వజూపిన ఆస్పత్రి యాజమాన్యం
- అనుమానం వచ్చి పోలీసులకు భర్త ఫిర్యాదు
- శ్మశానవాటికలో పోస్టుమార్టం నిర్వహించిన వైద్యులు
- రిపోర్టు వచ్చిన తర్వాత తదుపరి విచారణ చేపడతామన్న పోలీసులు



పరిణీత (ఫైల్)

కేపీహెచ్‌బీకాలనీ: మాతృత్వం కోసం తల్లడిల్లుతున్న ఓ మహిళ వైద్యం వికటించి మృతి చెందిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగుచూసింది. పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్ కుందన్‌బాగ్‌కు చెందిన కరుణాకర్ రెడ్డి, భార్య పరిణీత (36) నివాసం ఉంటున్నారు. కాగా వీరికి సంతానం కలగకపోవటంతో కేపీహెచ్‌బీకాలనీ రోడ్ నం.1లోని ప్రసాద్ ఆస్పత్రిలో డాక్టర్ నీరజ వల్లీని మే 31వ హిస్ట్రోస్కోపి చికిత్స నిమిత్తం సంప్రదించారు. మే 31 మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఆపరేషన్ థియేటర్‌కు తరలించారు.

గుండెనొప్పి వచ్చిందని ఇతర ఆస్పత్రికి తరలించి..

◆ ఈ క్రమంలోనే పరిణీతకు గుండె నొప్పి వచ్చిందని వైద్యురాలు సంబంధిత నర్సుకు తెలిపింది. వెంటనే భర్తకు సమాచారం ఇవ్వమని సూచించింది. భర్త కరుణాకర్‌రెడ్డి వచ్చేటప్పటికే పరిణీతను అంబులెన్స్‌లో యశోదా ఆస్పత్రికి తరలించేందుకు సిద్ధంగా ఉంచారు. డిశ్చార్జికి సంబంధించిన షీట్‌ను భర్తకు అందించలేదు.

ఎక్మో చేయటానికి తీసుకెళ్తుండగా కుప్పకూలిన పరిణీత

◆ యశోదా ఆస్పత్రిలో ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ ఉందని ఇందుకు సంబంధించిన ఆపరేషన్ చేయాలని వైద్యులు తెలిపారు. ఈ క్రమంలో ఎక్మో చేయటానికి తీసుకెళ్తుండగా ఒక్కసారిగా పరిణీత గుండెనొప్పితో కుప్పకూలింది. అనంతరం ఆమె గుండె నొప్పితో మృతి చెందిందని వైద్యులు ధృవీకరించారు. ప్రసాద్ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లనే మృతి చెందిందని భర్త కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. దీంతో ఆస్పత్రి యాజమాన్యం మాట్లాడుకుందామని చెప్పటంతో కరుణాకర్‌రెడ్డి ఈనెల 3వ తేదీన సితార హోటల్‌లో ఆస్పత్రి నిర్వాహకులను కలిశారు. ఈ క్రమంలో ఆస్పత్రి వైద్యులు ఇద్దరు నీ వల్ల అంటే నీ వల్లనే తప్పు జరిగిందని వాదించుకున్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందిందని పోలీసులకు ఫిర్యాదు

◆ దీంతో వైద్యుల నిర్లక్ష్యంతోనే తన భార్య మృతి చెందిందన్న అనుమానం కరుణాకర్‌రెడ్డికి బలపడింది. తనకు డబ్బు వద్దని, వైద్యుల నిర్లక్ష్యంతోనే తన భార్య మృతి చెందిందని ఆరోపిస్తూ జూన్ 3వ తేదీ కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గాజులరామారంలోని శ్మశానవాటికలో శుక్రవారం పరిణత మృతదేహాన్ని వెలికితీసి అక్కడే అధికారుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సుకున్నారు.